ఆధునికీకరణ పనుల పరిశీలన


మధురవాడలో అధికారులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


మెయిన్ రోడ్డు పక్కన మార్కెట్ నిర్మాణ పనులపై చర్చిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

భీమునిపట్నం : భీమిలిలో జోనల్ కార్యాలయాన్ని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మంగళవారం పరిశీలించారు. ఇక్కడ రూ.50 లక్షలతో కార్యాలయ భవనం ఆధునికీకరణ పనులు కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. అవి ఏ మేరకు జరుగుతున్నాయో పరిశీలించారు. అనంతరం పెద్దబజారు వద్ద రూ.2.50 కోట్లతో నిర్మిస్తున్న కొత్త మార్కెట్, షాపుల నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ఆయనకు నిర్మాణ పనుల వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాల్లో సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, ఎక్కడా ఈ విషయంలో రాజీ పడకుండా చూసుకోవాలని కోరారు. ఏసీపీ శ్రీనివాసరావు, ఈఈ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి

మధురవాడ : జీవీఎంసీ జోన్ – 2 మధురవాడ జోనల్ కార్యాలయం పునర్నిర్మాణ, ఆధునికీకరణ పనులు తక్షణమే పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో జరుగుతున్న పనులు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఇక్కడ వివిధ విభాగాల్లో ఏర్పాటు చేసిన నూతన సామగ్రి, నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు, వివిధ విభాగాల్లో జరిగిన పనులు, చేయాల్సిన మార్పులు తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. పనుల విషయంలో నిర్లక్ష్యం వద్దని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ


కనకాంబరాలు, లిల్లీ, విరజాజుల అలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి


తులసి, తమలపాకుల మాలలు, వెండి ఆభరణాలతో మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం కనకాంబరాలు, విరజాజులు, లిల్లీ, గజమాలలతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన అలంకరణకు దార్లపూడి రమణమ్మ, యశోద్, శైలజ సహాయ సహకారాలు అందించారు. ఈ అలంకరణను భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు పూర్తి చేశారు. వెలంపేటకు చెందిన పలివెల రాజశేఖర్, లలిత దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

• భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని తులసి, తమలపాకుల మాలలు, వెండి ఆభరణాలతో అలంకరించారు. ఈ ప్రాంతానికి చెందిన టీపీఎస్ ప్రవళిక రెడ్డి 11వ జయంతి సందర్భంగా ఆమె తల్లిదండ్రులు తుపాకుల అప్పలనాయుడు, హేమలత ఆధ్వర్యంలో ఆలయం వద్ద ఉచిత రక్తదాన శిబిరం, మెగా వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వీరికి బెస్ట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ప్రతినిధులు సహాయ సహకారాలు అందించారు.

క్లుప్తంగా

ప్రతిభకు వైకల్యం అడ్డురాదు


పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న మణి

కొమ్మాది : అంధత్వం ఉన్న అందరిలోనూ మిన్నగా అంధబాలికలు ప్రతిభా పాఠవాలు చూపిస్తున్నారని యూనియన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో మణి మేకలై అన్నారు. బీచ్‌రోడ్డు సాగర్‌నగర్‌లో గల ప్రభుత్వ అంధ బాలికల పాఠశాలకు యూనియన్ బ్యాంక్ ఆర్థిక సహకారంతో 2 ఏసీలు, ఒక బీరువా, బ్రెయిలీ రీడర్స్, స్పోర్ట్స్ దుస్తులు, మంగళవారం ఆమె అందజేశారు. విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో, సంకల్పంతో విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తిరుమల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


రమణ

పద్మనాభం : మండలంలోని ఐనాడలో ఒకరు అదృశ్యమైనట్టు పోలీసులు తెలిపారు. ఐనాడ గ్రామానికి చెందిన గొంప రమణ (40)కు విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కోనయ్య పాలెం గ్రామానికి చెందిన అమ్మాయితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె జన్మించింది. వీరిద్దరి మధ్య గొడవలుతో ఏడాది నుంచి భార్య కాపురానికి రావడం లేదు. ఈ క్రమంలో ఈ నెల 7న సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో రమణ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ కనిపించలేదు. దీనిపై రమణ తండ్రి సన్యాసిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మందుబాబులకు రూ.71,500 జరిమానా

పీఎం పాలెం : మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి న్యాయస్థానం రూ.71,500 లు జరిమానా విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కారుషెడ్ కూడలి, కొమ్మాది, మారికవస జాతీయ రహదారి కూడళ్లలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 42 మంది పోలీసులకు చిక్కడంతో వారిపై కేసులు నమోదు చేశారు. వారిని మంగళవారం న్యాయమూర్తి ముందు హాజరు పరచగా ఒక్కొక్కరికీ రూ.1500 నుంచి రూ. 3 వేల వరకూ మొత్తం 71,500 జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఏఎన్ఎంల ధర్నా


డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

మహారాణిపేట : వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఏఎన్ఎంలు ఆందోళనకు దిగారు. సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఏఎన్ఎంలు నినాదాలు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న నాయకులతో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు చర్చలు జరిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ఆందోళన విరమించాలని యూనియన్ నాయకులను డీఎంహెచ్‌వో కోరారు. అయినా ఏఎన్ఎంలు ఆందోళన కొనసాగించారు. బీసీజీ వ్యాక్సినేషన్‌ను రెండు రోజుల నుంచి తగ్గించాలని, యూనిఫారాల అలవెన్స్ ఇవ్వాలని, సెలవుల్లో కోత విధించరాదని, సచివాలయ ఏఎన్ఎంలపై పని ఒత్తిడి తగ్గించండాలని, సెలవుల్లో కూడా విధులు నిర్వహించవలసి వస్తుందని నాయకురాలు మణి తెలిపారు. అధికారుల ఒత్తిడి అధికంగా ఉందంటూ ఆందోళన కొనసాగించారు.

వైభవంగా మొగదారమ్మ మహోత్సవాలు


పూజలందుకున్న మొగదారమ్మ మహాలక్ష్మి అమ్మవారు


అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్, తదితరులు

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడ, ముసలయ్యపాలెం ఆరాధ్య దేవతలు శ్రీ మొగదారమ్మ, శ్రీ దుర్గాలమ్మ, శ్రీనూలమ్మ అమ్మవార్ల ప్రధాన పండగ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, స్థానిక నాయకులు లొడగల రామ్మోహన్, చెట్టిపిల్లి గోపి, సారిపిల్లి శ్రీను, శేఖర్ శ్రీనివాస్, నొడగల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

మొగదారమ్మ మహాలక్ష్మి అమ్మవారిని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ, పంచకర్ల రమేష్, గంటా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ధర్మకర్త లక్ష్మి ప్రసాద్ స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

గ్రామాల్లో అమ్మవార్ల అనుపోత్సవం

పద్మనాభం : మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం రాత్రి అమ్మవార్ల అనుపోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పద్మనాభం గ్రామంలో దుర్గాలమ్మ అమ్మవారి అనుపోత్సవంలో భాగంగా రాత్రి రథాలు ఊరేగించారు. దుర్గాలమ్మ ఆలయాన్ని దర్శించుకుని భక్తులు పూజలు చేశారు. పాండ్రంగి పంచాయతీ బర్లపేటలో ముత్యాలమ్మ అనుపోత్సవ సంబరాలు అంబరాన్ని తాకాయి. దుర్గాలమ్మ, ముత్యాలమ్మ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమ్మవార్ల ఆలయాల పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం


పాండ్రంగిలో వేణుగోపాల స్వామి, రుక్మిణి మాతకు కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

పద్మనాభం : మండలంలోని పాండ్రంగిలో వేణుగోపాల స్వామి ఆలయంలో ఐదు రోజులు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి కల్యాణం ఘనంగా జరిపారు. ముందుగా అంకురార్పణ, ధ్వజారోహణం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేణుగోపాల స్వామి, రుక్మిణి మాత ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు కల్యాణం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆర్.ఎస్.దేముడుబాబు, ఆర్.ఎస్.సత్యనారాయణరాజుతోపాటు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు వేణుగోపాల స్వామి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. మంగళవారం హోమాలు నిర్వహించారు.

పీఎం కిసాన్ సాయం విడుదల


భీమిలి వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన రైతులు

తగరపువలస : 2024 సంవత్సరానికి సంబంధించి పీఎం కిసాన్ పథకం మొదటి విడత సాయంగా రూ.2 వేలు వంతున రైతుల ఖాతాలకు ప్రధాని మోడీ జమ చేసే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని భీమిలి వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులతో కలిసి రైతులు ఆన్‌లైన్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా ఏడీఏ విజయప్రసాద్, ఏవో బి.శివకోమలి మాట్లాడుతూ అర్హులైన ప్రతీ రైతు కుటుంబానికి ఏడాదిలో మూడు సార్లు రూ.2వేలు వంతున ప్రధాని మోడీ జమ చేస్తారన్నారు. 2019 వరకు భూమి ఉన్న యజమానులు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. ఇప్పటి వరకు లబ్ధిదారులకు 16 వాయిదాలు జమ చేశారన్నారు. భూమిలేని కౌలు రైతులు, అటవీ భూముల సాగుదారులు కూడా ఈ పథకానికి అర్హులన్నారు. ఈ ప్రయోజనం పొందడానికి రైతులు ఈకేవైసీ, భూమి రికార్డుల అనుసంధానం, ఏపీబీఎస్ సిద్ధం చేసుకోవాలన్నారు. 2022, 2023 సంవత్సరాల లబ్ధిదారులకు 5 శాతం ఫిజికల్ వెరిఫికేషన్ కోసం రైతు భరోసా కేంద్రాలకు లబ్ధిదారుల జాబితా పంపించామన్నారు. ఈ జాబితాలో ఉన్న లబ్ధిదారులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తనిఖీ చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు శ్రద్ధగా చదివితే మంచి భవిష్యత్


విద్యార్థులకు కిట్లు అందిస్తున్న ఎంపీడీవో డాక్టర్ జానకి

భీమునిపట్నం : విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో డాక్టర్ జానకి సూచించారు. స్థానిక పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకోవడానికి మంచి అవకాశాలు ఉంటున్నాయని, ఆ మేరకు శ్రద్ధతో చదువుకుంటే మంచి భవిష్యత్ సొంతమవుతుందని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదువుకుంటే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చని, ఆ మేరకు కృషి చేయాలని కోరారు. ఎంఈవో శివరాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. సింహాచలం, ఉపాధ్యాయులు నయీం అన్సారి, సుజాత కుమారి, రామకృష్ణ, తులసి లక్ష్మి పాల్గొన్నారు.

మలుపు వద్ద ప్రమాదకరంగా డ్రైనేజీ


రామాలయం సమీపంలో ప్రమాదకరమైన మలుపు వద్ద శిథిలావస్థలో డ్రైనేజీ

తగరపువలస : చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం వద్ద మలుపు, మధ్యలో రక్షణ, హెచ్చరిక బోర్డు లేని డ్రైనేజీ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తగరపువలస అంబేడ్కర్ కూడలి నుంచి చిట్టివలస జ్యూట్‌మిల్లు వైపు శ్రీరామ్‌నగర్, మూలకుద్దు, పెరికివీధి, రెడ్డివీధి గ్రామాల ప్రజలు, అలాగే గోస్తనీనది దాటుకుంటూ వంతెన మీదుగా భీమిలి, భోగాపురం మండల ప్రజలు నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. ఇరువైపులా వెళ్లేవారు రామాలయం వద్ద కూడలి మీదుగా దాటుతుంటారు. ఇక్కడ గతంలో నిర్మించిన డ్రైనేజీ వద్ద రక్షణ గోడ, హెచ్చరిక బోర్డు లేకపోవడం వల్ల చాలా మందికి తెలియదు. కొత్తవారు, వేగంగా వచ్చే వాహనదారులు తరచూ ఈ డ్రైనేజీలోకి దూసుకుపోతుంటారు. ఇక మద్యం మత్తులో ఉన్నవారి సంగతి సరేసరి. ముఖ్యంగా చిట్టివలస నుంచి గుడివాడ వైపు తిరిగే మలుపు అత్యంత దగ్గరగా ఉండడంతో కొన్నిసార్లు ట్రాక్టర్లు, లారీలు వంటి భారీ వాహనాలు తిరగలేక డ్రైనేజీలోకి దిగిపోతున్నాయి. దీంతో నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు సైతం ఇక్కడకు వచ్చేసరికి అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు జోక్యం చేసుకుని ప్రమాదకరమైన కూడలి మలుపు వద్ద డ్రైనేజీ రక్షణ గోడను పెంచడంతోపాటు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అమ్మవార్లకు పసుపు, కుంకుమ సమర్పణ


దుర్గాలమ్మ ఘటాలు ఊరేగిస్తున్న గ్రామ పెద్దలు


విశేష అలంకరణలో చంద్రంపాలెంలోని దుర్గాలమ్మ


విశేషంగా పూజలందుకున్న రేవళ్లపాలెంలోని భూలోక అమ్మవారు

మధురవాడ : చంద్రంపాలెంలో దుర్గాలమ్మ, బంగారమ్మ, రేవళ్లపాలెం భూ లోక అమ్మవార్లకు మధురవాడ పరిసర ప్రాంత ప్రజలు మంగళవారం పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధురవాడ ప్రాంతీయుల ఆరాధ్య దేవతలను భక్తులు బాజాభజంత్రీలు, సాముగరిడీలు, పులి వేషాలతో ఊరేగింపుగా గుడులకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర గట్టు చంద్రంపాలెం దుర్గాలమ్మ వారాలు పండగను పురస్కరించుకుని అమ్మవారికి ఉదయం 6.30 గంటలకు నిత్యార్చన, అనంతరం పంచామృత, సుగంధ ద్రవ్యార్చనలు, కుంకుమ పూజలు, పుష్పార్చన, అనంతరం విశేష అలంకరణ చేశారు. సాయంత్రం అమ్మవారి ఇంటి నుంచి సాము గరిడీలు, కేరళ వాయిద్యాలు, పులివేషాలు, జంగిడితో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. ముందుగా బంగారమ్మ, తర్వాత దుర్గాలమ్మకు పసుపు కుంకుమ సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ డ్రైవర్‌పై కేసు

పీఎం పాలెం : కారుషెడ్ కూడలి సిగ్నల్ పాయింట్ వద్ద ఆగి ఉన్న కారును ఢీకొట్టిన లారీ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని పాత డైరీఫారం ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఇషాక్ విజయనగరం నుంచి విశాఖకు సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో వస్తుండగా కారుషెడ్ కూడలి వద్ద అదే రోడ్డులో వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో కారుకు బాగా డ్యామేజ్ అయింది. బాధితుని ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్‌పై కేసు

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని రుషికొండ ఏ 1 కన్వెన్షన్ వద్ద నిర్లక్ష్యంగా కారు నడిపి ఓ వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన కారు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 11న సాగర్‌నగర్ వైపు నుంచి తగరపువలసకు కారులో వెళ్తున్న మోహన్ రెడ్డి రుషికొండ ఏ1 కన్వెన్షన్ సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో మరో రోడ్డు వైపునకు కారు మళ్లింది. ఆ సమయంలో ఆ రోడ్డులో వెళ్తున్న పి.కార్తీక్ అనే వ్యక్తిని బలంగా ఢీకొట్టడంతో అతని పక్కటెముకు విరిగిపోయింది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కేజీహెచ్‌లో డెంగ్యూ కలకలం

యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టిన అధికారులు


సింటెక్స్ వాటర్ ట్యాంక్‌లో ఎప్పటి నుంచో ఉన్న నీటిని పరిశీలిస్తున్న మలేరియా అధికారి


నర్సింగ్ స్కూల్లో డెంగ్యూ నివారణకు మినీ ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది


నర్సింగ్ కళాశాల, స్కూల్ చుట్టూ యాంటీ లార్వా మందు పిచికారీ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

దాబాగార్డెన్స్: ఎంతో మందికి ఆరోగ్య సేవలందిస్తున్న కేజీహెచ్‌లో డెంగ్యూ కలకలం రేపుతోంది. అపరిశుభ్ర వాతావరణంతో కేజీహెచ్ కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యంగా కేజీహెచ్‌కు అనుసంధానంగా ఉన్న నర్సింగ్ కళాశాల, నర్సింగ్ స్కూల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. డ్రైనేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. డెంగ్యూ జ్వరంతో కేజీహెచ్‌లో చికిత్స పొందే ఎందరో రోగులకు వైద్య సేవలందిస్తున్న నర్సింగ్ విద్యార్థినికి డెంగ్యూ సోకింది. కింగ్ జార్జి ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న నర్సింగ్ స్కూల్ విద్యార్థికి డెంగ్యూ సోకింది. సమాచారం అందిన జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబశివరావు, జోన్–4 మలేరియా ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సిబ్బంది, అప్రమత్తమయ్యారు. వ్యాధి మకరొాకరికి సోకకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. అపరిశుభ్రంగా ఉన్న డ్రైనేజీలు, మూతలు లేని సింటెక్స్ మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించారు. కేజీహెచ్‌లో యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్ప్రింగ్, మినీ ఫాగింగ్ చేపట్టారు.

విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ కిట్ల పంపిణీ


కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసిన బ్యాగులు, పుస్తకాలు

తగరపువలస : నూతన విద్యాసంవత్సరానికి సంబంధించి భీమిలి నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాక్షికంగా బ్యాగులు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బెల్టులు, బూట్లు, డిక్షనరీలు పంపిణీ చేస్తున్నారు. చాలా పాఠశాలలకు ఇంకా పూర్తి స్థాయిలో మెటీరియల్స్ రావాల్సి వుంది. యూనీఫారాలు మాత్రం ఇంకా సరఫరా కాలేదని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలు ప్రారంభమై వారం రోజులవుతున్నా పూర్తి స్థాయిలో బ్యాగులు, స్టేషనరీ సరఫరా కాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. వేగవంతంగా వీటిని పాఠశాలలకు అందించే బాధ్యత విద్యాశాఖ అధికారులు తీసుకోవాలని కోరుతున్నారు.

హుద్‌హుద్ బాధితులకు ఇళ్లు కేటాయించాలి


ధర్నా చేస్తున్న బాధితులు

మహారాణిపేట : హుద్‌హుద్ తుపానులో ఇళ్లు కోల్పోయిన తమకు ఇళ్లు కేటాయిస్తూ పట్టాలు ఇచ్చారని.. అయితే తమకు కేటాయించిన ఇళ్లలోకి వెళ్తే కొందరు అడ్డుకుని ఇవి తమ ఇళ్లు అని.. మీకెవరు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారని లబ్ధిదారులు వాపోయారు. డ్రా ద్వారా నూట యాభై ఒక్క మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారని తెలిపారు. బక్కన్నపాలెంలో హుద్‌హుద్ బాధితుల కోసం నిర్మించిన 320 ఇళ్లల్లో తమకు ఇళ్లు కేటాయించాలని వారు కోరుతూ కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

అసభ్య ప్రసంగాలను ప్రతిఘటించండి

సీతంపేట: అసభ్య ప్రసంగాలను ప్రతిఘటించండి అంటూ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ పిలుపు నిచ్చింది. ఈమేరకు బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిని జాగృతం చేసే బదులు జాతి ఐక్యతకు భంగం కలిగేలా ప్రసంగాలు ఉంటున్నాయని అది ఎంతమాత్రం క్షేమకరం కాదన్నారు. ఐక్యరాజ్యసమితి ఏటా జూన్18న అంతర్జాతీయ అసభ్య ప్రసంగాల ప్రతి ఘటనా దినంగా ప్రకటించిందని గుర్తుచేశారు. పీస్ అండ్ హార్మోనీ సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రజలను జాగృతం చెయ్యాలనే సంకల్పంతో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యావేత్తలు, మతపెద్దలు పాల్గొని అభిప్రాయాలు తెలపాలన్నారు.

ఎమ్మెల్యే గంటాకు ఆహ్వానం

తగరపువలస : త్వరలో జరగనున్న ఆనందపురం మండల సాధారణ సమావేశానికి హాజరు కావాలని కోరుతూ మండల ప్రజాప్రతినిధులు, అధికారులు మంగళవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆహ్వానించారు. నగరంలోని ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు ఆహ్వానం పలికారు. వీరిలో భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, తదితరులు ఉన్నారు.